www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 14 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

## సేవలను మరింత మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యం



-రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా పనిచేయాలి
-అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి
-అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన మంత్రి తుమ్మల

2లో..

# ఆ గ్రామ పంచాయతీలను తెలంగాణకు ఇవ్వండి




- కుంటుపడుతున్న విద్యా, వైద్యం, మానవస్థితిగతులు
- ప్రధాని మోడిని ఇక్కడికి తీసుకొద్దాం
- రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి

**ప్రజాపక్షం/భద్రాచలం :** అశాస్త్రీయ పద్ధతిలో చోటు చేసుకున్న రాష్ట్ర విభజన ఆ ఐదు గ్రామపంచాయితీల ప్రజలకు శాపంగా మారిందని, దీంతో వారు అన్ని విధాలు నష్టాలకు గరువుతున్నారని, ఇప్పటికైనా కేంద్రం పునరాలోచన చేసి పోలవరం పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన భద్రాచలం పూర్వ మండల గ్రామ పంచాయితీలైన కన్నాయి గూడెం, పిచుకలపాడు, ఎటపాక, పురుషోత్త పట్నం, గుండాలను తెలంగాణలో కలపాలని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి డిమాండ్ చేశారు. ఐదు గ్రామపంచాయితీల వితరణ కోసం భద్రాద్రి ఐఖ్యతా గళం పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన భద్రాద్రి పునరేకీకరణ విస్తృత మిగతా 2లో..

## నేడు జిల్లాలో ముగ్గురు మంత్రుల పర్యటన

-కాంగ్రెస్ కార్యాలయంలో కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరు
-పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన







**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఖమ్మం జెడ్పి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తదనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే అంబేడ్కర్ జయంతోత్సవాల్లో మంత్రులు పాల్గొంటారు. కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో నూతనంగా నియమించబడిన జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో మంత్రులు పాల్గొంటారు. తదనంతరం మల్లు భట్టి విక్రమార్క ముదిగొండ మండలంలో పర్యటిస్తారు. వెంకటాపురంలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు సువర్ణపురం గ్రామంలో రూ.2.5 కోట్లతో నిర్మించే బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. కమలాపురం, అనసాగరం గ్రామాల మధ్య రూ.3.25 కోట్లతో నిర్మించే రోడ్డుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేస్తారు. 14వ తేదీ రాత్రి ఖమ్మంలో బస చేయనున్నారు. 15న పెనుబల్లి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. వేంసూరు మండలం వెంకటాపురం మిగతా 2లో..



(ఫైల్)

# బాధిత రైతులకు న్యాయం జరిగేనా..?

-సాయి కోల్డ్ స్టోరేజ్ బాధిత రైతుల్లో ఆందోళన
-అధికారుల ఉదాసీన వైఖరి





(ఫైల్)

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రైతుల్లో అవగాహన లేమి, అధికారుల ఉదాసీన వైఖరి వెరసి పలు సందర్భాల్లో రైతాంగం నష్టపోతూనే ఉంది. అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. అంతా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగానే వ్యవహరిస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను రైతులు శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరీజ్)లో నిల్వ చేస్తున్నారు. ధరలను పరిగణలోకి తీసుకుని సమయానుకూలంగా విక్రయించుకునేందుకు రైతులు నిల్వ చేసుకుంటున్నారు. ఇందులో మిర్చి రైతులే అధికంగా ఉన్నారు. కోట్ల విలువైన రైతుల వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసే శీతల గిడ్డంగుల్లో భద్రత, ఇతర ప్రమాణిక పద్ధతులను పాటిస్తున్నారా మిగతా 2లో..

# దళితుల పట్ల కొనసాగుతున్న వివక్ష

-సద్వినియోగం కానీ సబ్‌ప్లాన్ నిధులు
-డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత వర్గాల సంక్షేమంలో వివక్ష పాటిస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం తెలిపారు. సబ్ ప్లాన్ నిధులను కేవలం బడ్జెట్‌లో కేటాయిస్తున్నారు తప్ప పూర్తి స్థాయిలో వినియోగించడం లేదని ఆయన ఆరోపించారు. దళిత హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా మహాసభ సోమవారం స్థానిక గిరి ప్రసాద్ భవన్‌లో జరిగింది. యామాల గోపాల రావు, సృజన అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో ఏసురత్నం మాట్లాడుతూ సామాజికంగా వివక్షకు గురవుతున్న వర్గాలపై పాలకులు దృష్టి సారించడం లేదన్నారు. అనేక దశాబ్దాలుగా దళితుల కోసం కేటాయిస్తున్న నిధులు సద్వినియోగం కావడం లేదని పక్కా దారి పట్టడం వల్లే దళితులు మిగతా 2లో..



# ఆ గ్రామ పంచాయతీలను తెలంగాణకు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)
స్థాయి అఖిలపక్ష సమావేశం సోమవారం పట్టణంలోని బ్రిడ్జీ సమీపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. అనేక పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలోని చివరి భూ భాగం భద్రాచల పుణ్యక్షేత్రం అని , పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల పేరుతో రాష్ట్ర విభజన సమయంలో ఏడు మండలాలను ఏపిలో విలీనం చేశారని, ఆ ఏడు మండలాల్లో ఒకటైన భద్రాచలం పట్టణం మినహా పూర్వ మండలం మొత్తం ఉందని చెప్పారు. దీంతో ఇక్కడ విద్యా, వైద్యపరమైన సమస్య తలెత్తిందని, ప్రజలు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాల విద్య మొత్తం తెలంగాణలో చదివిన విద్యార్థులు పై చదువులు కోసం పోటీ పరీక్షలు రాసి ఉత్తీర్ణ సాధిస్తే స్థానికత కారణంగా వారికి సీట్లు దక్కడం లేదని, అసలు మీ అడ్రస్ ఏంటి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం దీనిపై పలు మార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాను ఈ ఐదు గ్రామపంచాయితీలో విషయంలో చర్చించగా ప్రాధాన్యతా అంశంగా తీసుకున్నారని తెలిపారు. ఇక్కడి పరిస్థితి కేంద్రంలో ఉన్న మోడికి అర్థం కావడం లేదని, ఆయనను వచ్చే ఏడాది వచ్చే శ్రీరామ నవమికి ఆహ్వానించి స్వయంగా పరిస్థితులను చూపిద్దామని, ఇందు కోసం ఒక ప్రతినిధి బృంధంగా ఏర్పడి మోడిని కలిసి ఆహ్వానిద్దామని చెప్పారు. చారిత్రక రామాయణ ఆధారాలున్న అసలు సిసలైన పుణ్యక్షేత్రం భద్రాచలం రామాలయం అని, ఇక్కడికి మోడి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.రాముని కోవెల తెలంగాణలో ఉంటే దేవుని మాన్యం వేలాది ఎకరాలు ఏపిలో ఉందని, తద్వార దేవాలయాభివృద్ధి చేసుకునేందుకు అడ్డంకులు ఎదరువుతున్నారని. ప్రజల ఆకాంక్షలు, బౌగోళిక పరిస్థితులు, పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేణుక కోరారు. ఆ ఐదు గ్రామపంచాయితీల ప్రజలు విద్య,వైద్యం, రవాణా, ఆదాయం, రెవెన్యూ, ఇతర ప్రభత్వ సేవలు భద్రాచలంతో ముడిపడి ఉండటం సరైందని, కానీ వారి పరిపాలన ఆంధ్రప్రదేశ్‌తో ఉండటం తీవ్ర ఇబ్బంది కరమైన అంశమని ఆమే ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఐదు గ్రామ పంచాయితీలను సాధించే వరకు ఈ ప్రాంత ఆడ బిడ్డగా కలిసి వస్తానని, అవసరమైతే కేంద్రం మెడలు వంచి ఒప్పించి ఆ పంచాయితీలను తిరిగి తెలంగాణలో విలీనం చేసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిద్దామని చెప్పారు. అంతకు ముందు బిఆర్ఎస్ రాష్ట్ర ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో చోటుచేసుకున్న అంశంతో ఐదు పంచాయితీల ప్రజలకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతోందని, విభజన జరిగి 12 ఏళ్లు అవుతున్నా ఆ సమస్య ఓ కొలిక్కి రాకపోవడం దురదృష్ట కరమని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసిఆర్ ఈ సమస్యను పలుమార్లు కేంద్రానికి వివరించారని, గోదావరి వరదల సమయంలో ఏపి ప్రభుత్వం తెలంగాణ సమీపంలోని ఏపి విలీన గ్రామాలను కనీసం పట్టించుకోకుండా ఉంటే తెలంగాణ ప్రభుత్వం ఆ ప్రజలకు అండగా ఉందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్రం సర్వేబృంధాన్ని ఇక్కడి పంపించి, స్థితిగతులు, ప్రజల ఇబ్బందులను అధ్యయనం చేసి ఆ ఐదు పంచాయితీలను తెలంగాణలో కలిపేందుకు చొరవచూపాలని కోరారు. అనంతరం స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం పట్టణానికి ఆనుకుని ఉన్న ఆ ఐదు గ్రామ పంచాయితీల ప్రజలు ప్రతీ అవసరానికి భద్రాచలమే రావాలని, పరిపాలనా పరమైన సమస్యలు ఎవైనా ఉంటే వాటి కోసం ఏవిలోని సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ప్రధానంగా విద్యార్థులు పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని, కష్టపడి చదువుకుని ర్యాంకులు సాధిస్తే సీట్లు రాక మనోవేదనకు గురవుతున్నారని, ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రంగానే ఉంటాయని, డబ్బులు పోసి చదువుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశ పౌరులైన ఆ ఐదు గ్రామపంచాయితీల ప్రజలపై కేంద్రం కనికరం చూపాలని కోరారు. అనంతరం పలువురు అఖిలపక్షం నేతలు మెచ్చా వెంకటేశ్వర్లు, కెచ్చల కల్పన, కుంజా ధర్మా, మానె రామకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అటవి అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు. సర్పంచ్ పూనెం కృష్ణ, టిజిఓ నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, అమరనేని రామారావు, భార్గవ్ చైతన్య, పెన్షనర్ల జిల్లా అధ్యక్షులు చల్లగుళ్ల నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కళ్యాణం నాగేశ్వరరావుతో పాటు యుటిఎఫ్ నాయకులు చావా రవి, రాజు, విలీన పంచాయితీల నాయకులు నక్కా వెంకన్న, శివ, అవులూరి సత్యనారాయణ, స్థానిక కాంగ్రెస్ నాయకులు బుడగం శ్రీనివాసరావు, చింతిర్యాల రవికుమార్, సరెళ్ల నరేష్, ఉద్యోగ గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పట్ల కొనసాగుతున్న వివక్ష

(మొదటిపేజీ తరువాయి)
ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిపోతున్నారని ఆయన తెలిపారు. దళితులకు జనాభా దామాషా పద్ధతి ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఈ ఏడాది బడ్జెట్‌లో 20 శాతం ఉన్న దళితులకు కేవలం 16 శాతం మాత్రమే కేటాయింపులు జరిగాయని ఆయన తెలిపారు. ఆర్థిక రాజకీయ ఆధిపత్యాన్ని ప్రశ్నించి సమసమాజం వైపు నడిపించేలా దళిత హక్కుల పోరాట సమితి కృషి చేస్తుందన్నారు. దళిత వర్గాలను రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు ఇతర వ్యవహారాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ రంగం పూర్తిగా నిర్వీర్యమై ప్రైవేటు రంగంలోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నందున ప్రైవేటు రంగంలోనూ దళితులకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళితుల అభ్యున్నతి కోసం, సామాజిక చైతన్యం కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, డిహెచ్‌పిఎస్ నాయకులు యంగల ఆనందరావు, పగిడిపల్లి ఏసు, తడికమళ్ల ఏబు, తోటపల్లి సీతారాములు, మామిడాల కిరణ్, వరదా నర్సింహారావు, నారపోగు వసంతరావు, నాగేశ్వరరావు, మాతంగి శ్రీనివాసరావు, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

### అధ్యక్ష, కార్యదర్శులుగా ఏసు, ఆనందరావు...



దళిత హక్కుల పోరాట సమితి ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పగిడిపల్లి ఏసు, యంగల ఆనందరావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 31 మందితో జిల్లా సమితిని, 18 మందిని కార్యవర్గ సభ్యులను మహాసభలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా తడికమళ్ల ఏబు, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు, సీతారాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యామాల గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా వరదా నర్సింహారావు, మామిడాల కిరణ్, నారపోగు వసంతరావు, కోశాధికారిగా సృజన లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు ఏసు, ఆనందరావు లు మాట్లాడుతూ దళిత హక్కులు, సంక్షేమం కోసం పోరాడతామని తెలిపారు.

# రెవెన్యూ వ్యవస్థలో నిర్లక్ష్యం సహించం

**-ఏప్రిల్ 26లోపు 330 స్లాట్ బుకింగ్‌లు పూర్తి చేయాలి**
**-రెవెన్యూ శాఖపై కలెక్టర్ సమీక్ష**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రెవెన్యూ వ్యవస్థలో నిర్లక్ష్యం అసలు సహించమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణ, భూ భారతి, సాదాబైనామా ఇతర రెవెన్యూ సంబంధిత పెండింగ్ అంశాలపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు సమయానికి పూర్తి కావాలంటే భూ సేకరణలో ఎటువంటి జాప్యం ఉండకూడదన్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూములను గుర్తించి చట్టబద్ధమైన విధానాల ప్రకారం త్వరితగతిన స్వాధీనం చేసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూ సేకరణ దాదాపు పూర్తి అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రైతుల వల్ల ఫీల్డ్ స్థాయిలో పనులు నిలిచిపోయాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుని భూములు స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఆమోదం పొంది ఇంకా భూ భారతి పోర్టల్‌లో అప్‌డేట్ కానీ దరఖాస్తులపై సమీక్షించి అప్‌డేట్ కాకపోవడానికి గల కారణాలపై కలెక్టర్ తహసీల్దార్‌ను ప్రశ్నించి తక్షణమే అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లోఉన్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని నిర్దేశిత కాలపరిమితిలో భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఏప్రిల్ 26లోపు 330 పెండింగ్ స్లాట్ బుకింగ్‌లను తహసీల్దార్లు పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. స్లాట్ బుకింగ్ సేవలు కూడా పూర్తి స్థాయిలో వినియోగం కావడం లేదన్నారు. అక్రమ గనుల తవ్వకాలపై పూర్తి స్థాయిలో నియంత్రణ విధించాలని ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా చేసే వారిపై రూ. 10వేలు, రూ. 20వేలు వంటి చిన్న జరిమానాలు విధించడం కాకుండా తప్పనిసరిగా వాహనాలను సీజ్ చేసి ఆర్‌సిని కూడా స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, ఇరిగేషన్, నేషనల్ హైవే, రైల్వేస్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఏడి మైన్స్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాలో ముగ్గురు మంత్రుల పర్యటన

(మొదటిపేజీ తరువాయి)
గ్రామంలో 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆయన శంకుస్థాపన చేస్తారు. దమ్మపేట మండలం జగ్గారం, మల్లవరం గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్‌లకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తల్లాడ మండలం చెన్నూరు గ్రామంలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి బాలపేట గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని, తల్లాడలో ఎస్సి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తారు. 14వ తేదీ అంబేడ్కర్ జయంతోత్సవాల్లో పాల్గొన్న తర్వాత సాయంత్రం 59వ డివిజన్‌లో సిసి రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమం అనంతరం కల్లూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో బస చేస్తారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లోనూ కాంగ్రెస్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# దోస్త్ నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జూన్‌లో ప్రారంభం కానున్న 2026 27 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ విడుదలైందని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి మే ఏడు వరకు తొలి విడతలో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వెబ్ ఆప్షన్స్ ఏప్రిల్ 30 నుంచి మే ఎనిమిది వరకు ఉంటుందని మరిన్ని వివరాలకు దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ కో ఆర్డినేటర్ ఎండి సలీంపాషాను, టెక్నికల్ అసిస్టెంట్ వేలాద్రిని సంప్రదించవచ్చునని ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు.

# సేవలను మరింత మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంగన్‌వాడీ సేవలను మరింత మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా పనిచేయాలని మంత్రి తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సెల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపర్చినవిధంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల జీత భత్యాలు పెంపుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలపై నిర్లక్ష్య ధోరణిని అవలంభించిందన్నారు. గత ప్రభుత్వంలో రిటైర్ అయిన వారికి కూడా ఈ ప్రభుత్వం కొత్త జీవో ఇచ్చి బెన్‌ఫిట్స్ అందించేవిధంగా కృషి చేసిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చడమే లక్ష్యమని తెలిపారు. అంగన్‌వాడీ సేవలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు సరైన సమయంలో పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు దోహదపడుతుందన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. స్మార్ట్ ఫోన్లు సక్రమంగా వినియోగించాలని, మీ ఫోన్‌కు సంబంధించి ప్రతిదిపై ఆఫీసర్లు పరిశీలిస్తూనే ఉంటారని తెలిపారు. యూనియన్ల పేర్లతో పోరాటాలు, ఉద్యమాలు చేస్తే ఏమి రావని శక్తి వంచన లేకుండా పనిచేస్తేనే మీకు రావాల్సినవి వస్తాయని తెలిపారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, నగర పాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఐసిడిఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇందిరా మహిళాశక్తి రేవంత్ అన్న భరోసా కింద మైనార్టీ మహిళలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

# బాధిత రైతులకు న్యాయం జరిగేనా..?

(మొదటిపేజీ తరువాయి) లేదా అన్న విషయాలను తెలుసుకోవాల్సిన అధికారులు ఆ పని చేయడం లేదని పర్యవేక్షణ కరువవుతుందన్న ఆరోపణ రైతుల నుంచి వినవస్తుంది. విద్యుత్, అగ్నిమాపక శాఖ, వ్యవసాయం, రెవెన్యూ శాఖల పర్యవేక్షణ అవసరం. దాదాపు 36వేల మిర్చి బస్తాలు కాలిపోయిన మధిర మండలంలోని ఆత్కూర్ వద్ద గల సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీ బాధిత రైతులకు న్యాయం జరుతుందా అన్న ఆందోళన నెలకొంది. కోల్డ్ స్టోరేజీ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటం ఒక రకమైన కారణమైతే ఇన్సూరెన్స్ కంపెనీలు ఎలా స్పందిస్తాయన్నది మరోక మీ మాంస. ఈ కోల్డ్ స్టోరేజీలో చిన్న సన్నకారు రైతులే ఎక్కువగా మిర్చిని నిల్వ చేశారు. సుమారు 50వేల సామర్థ్యం కలిగిన ఈ కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం జరిగే నాటికి 36వేల బస్తాలు నిల్వ ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే రైతులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో బాధిత రైతులందరూ తమ వద్ద ఉన్న ఆధారాలను మధిర తహసీల్దార్‌కు అందజేయాలని అధికారులు తెలియజేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రమాద ఘటనను పరిశీలించిన అనంతరం రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాథమిక సమాచారం మేరకు వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి రూ. 25 కోట్ల మేర ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. కోల్డ్ స్టోరేజీకి ఐదు నుంచి ఆరు కోట్ల ఇన్సూరెన్స్ ఉందని తెలుస్తుంది. అయితే రైతుల నుంచి ఇన్సూరెన్స్ పేరుతో శీతల గిడ్డంగుల యాజమాన్యాలు ఒక్కో మిర్చి బస్తాకు రూ. 200 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా అధికార యంత్రాంగం సరైన రీతిలో స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 36వేల బస్తాలు 312 మంది రైతులదని తెలుస్తుండగా ప్రమాదం జరిగిన తర్వాత నిల్వ ఉన్న మిర్చి కంటే ఎక్కువ మంది రైతులు తమ మిర్చి బస్తాలు కూడా కాలిపోయాయని రైతులకు ఆధారాలు అందజేస్తున్నారన్న ఆరోపణ వినవస్తుంది. శీతల గిడ్డంగి యాజమాన్యం సరైన రీతిలో రికార్డులను నిర్వహించకపోవడంతో మిర్చి విక్రయించిన కొందరు రైతులు కూడా అధికారులకు దరఖాస్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో అధికార యంత్రాంగం ఉదాసీన వైఖరిని విడనాడి వెంటనే రైతుల వివరాలను సేకరించి న్యాయం జరిగే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల నుంచి పూర్తి స్థాయిలో సహకారం ఉంటే తప్ప ఇంత పెద్ద మొత్తంలో ఇన్సూరెన్స్ సాధ్యం కాదనే వాదన కూడా వినపడుతుంది. 12 ఏళ్ల క్రితం అగ్నిప్రమాదం జరిగినప్పుడు రైతులకు న్యాయం జరగలేదన్న వాదన కూడా వినిపిస్తుంది. సాయి కోల్డ్ స్టోరేజ్ విషయంలోనైనా న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## పది పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజాపక్షం/పాల్వంచ : పరీక్షల నిర్వాహణలో పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పాల్వంచ బొల్లోరుగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వాహణ పరిశీలించారు. కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా హాల్‌లో సరైన వెలుతురు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్‌లు, తాగునీటి సదుపాయం తదితర మౌళిక వసతులు కల్పించాలన్నారు. ప్రతీ విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ కూర్చునేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా సమయాల్లో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్నా పత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ, భద్ర పరిచే విధానాల వంటి పలు అంశాలను పరిశీలించారు. నిర్వాహణలో పూర్తి పారదర్శకత, రాగాద్వేషాలకు అతీతంగా నిభద్దతతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి భాధ్యత



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని నేలకొండపల్లి ఏఎస్సై లతీఫ్ షరీఫ్ పేర్కొన్నారు. మండలం లోని ఆజయ్ండా లో సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రయాణం చేసేటప్పుడు ఇంటి వద్ద ఉన్న కుటుంబం ను మనం గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్ల కు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తేజావత్ శివాజీ, ఉప సర్పంచ్ పూల్సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, కానిస్టేబుల్ రాజేష్, అంగన్వాడీ టీచర్ చంద్రావతి, వీవో, అధ్యక్షురాలు కవిత, ఫీల్ అసిస్టెంట్ వెంకటేశ్వర రావు, తేజావత్ నరేష్, సుశీల, లక్ష్మ ణరావు, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజాపక్షం/కామేపల్లి: మండల ప్రజలు వేసవి, వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని కామేపల్లి ప్రభుత్వ వైద్యాధికారులుల హారిక, రంజితులు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రోజు రోజుకు ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటికి వెళ్లరాదని సూచించారు. వేసవిలో ప్రజలు తెల్లటి కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని అన్నారు. మండల ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవపదార్థాలను సేవించాలన్నారు. మండలంలో పలు గ్రామాల్లో పల్లె దవాఖానాల్లో వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంచి పెట్టారు. ఈకార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాపక్షం/కామేపల్లి: బర్లగూడెం గ్రామ శివారులో వ్యవసాయ పొలాల్లో పేకాట ఆడుతున్న వారిపై కామేపల్లి పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో నలుగురిని అదుపులోకి తీసుకొని, మరో ముగ్గురు పరారైనట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేపట్టిన పోలీసులు పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్నారు. పట్టుబడి నలుగురు, పరారీలో ఉన్న ముగ్గురు వ్యక్తులు డోర్నకల్ పట్టణానికి చెందిన వారిగా గుర్తించారు. నిందుతుల నుండి రూ 10,700 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న నిందుతులు ఇండ్ల శ్రీనివాస్, చంద్రగాని వెంకటేశ్వర్లు, పట్ని రాజేష్ కుమార్, గోపగాని లక్ష్మీ నారాయణలు కాగా, పరారీలో తాడేటి నాగరాజు, బొల్లి మురళి, జరుపుల సుమన్‌లు ఉన్నట్లు తెలిపారు.

## ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు పంపిణీ



ప్రజాపక్షం/అశ్వాపురం: మొండికుంట గ్రామ పంచాయితీలోని ఉపాధి హామీ కూలీలకు 2024, 25 ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పూర్తి చేసుకున్న కూలీలకు సోమవారం మొండికుంట గ్రామ పంచాయితీ కార్యాలయంలో గడ్డ పారలు, తట్టలు సర్పంచ్ మర్రి సంధ్య చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లమల్ల శివకుమార్, కార్యదర్శి సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, పాలకవర్గ సభ్యులు రామిడి శంభారెడ్డి, గాదే మల్లికార్జున్, పనుల స్వరూప, మూతి రమణి, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త పెన్షనర్లకు మోక్షమెప్పుడో





◆ఏళ్ల తరబడి అభాగ్యుల నిరీక్షణ ◆ బడ్జెట్ ఆశలు తీరేనా? ప్రజాపాలనలోనూ అవే అర్జీ..!

ప్రజాపక్షం/నేలకొండపల్లి : సమాజంలో ఆదరణ కరువై, ఆర్థికంగా చితికిపోయిన అభాగ్యులకు ప్రభుత్వం అందించే చేయూత పింఛన్లు అందని ద్రాక్షలా మారాయి. కొత్త పెన్షన్ల మంజూరు నిలిచిపోవడంతో వేలాది మంది నిరుపేదలు కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు. నేలకొండపల్లి మండల వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు.. మా పెన్షన్ ఎప్పుడొస్తుంది..?అని అధికారులను వేడుకుంటున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

### ఆశలు రేపిన బడ్జెట్.. ఆచరణలో ఏది..?

ఇటీవల రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో కొత్త పెన్షన్ల మంజూరుకు నిధులు కేటాయిస్తామని, అర్హులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అభాగ్యుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారలేదు. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు తోడు, ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కొత్తగా వచ్చిన దరఖాస్తులు మండల కార్యాలయంలో కుప్పలుతెప్పలుగా పేరుకుపోయాయి.

### నేలకొండపల్లిలో నిరీక్షణ పర్వం

మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం. వందలాది దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నాయి. 2022 ఆగస్టు తర్వాత కొత్త పెన్షన్ల ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో చాలామంది వృద్ధులు మందు బిళ్లల కోసం, కనీస అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు చేతిలో చిల్లిగవ్వ లేక, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఆర్థిక భరోసా లేక కాయకష్టం చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.పెరిగిన ధరల దృష్ట్యా ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

### ప్రజాపాలనలోనూ అవే విన్నపాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో అత్యధికంగా వస్తున్నవి పెన్షన్ దరఖాస్తులేనని అధికారులు చెబుతున్నారు. వార్డు సభలు, గ్రామ సభల్లో ప్రజల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్ కొత్త పింఛన్ల మంజూరే. మండల స్థాయిలో అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నప్పటికీ, పైస్థాయి నుంచి అనుమతులు రాకపోవడంతో మేము ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

### ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు

నేలకొండపల్లి మండలంలో ప్రస్తుతం అందుతున్న పింఛన్ల లబ్ధిదారులు వేలల్లో ఉన్నప్పటికీ, అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న వారు మరో వెయ్యికి పైగానే ఉంటారని అంచనా. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి కొత్త పింఛన్లను మంజూరు చేయాలని మండల నిరుపేదలు డిమాండ్ చేస్తున్నారు.

## వేతన ఒప్పందం జాప్యంపై జేసీఎల్ వరంగల్‌కు వినతి



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండలంలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో కొనసాగుతున్న 14వ వేతన ఒప్పందం జాప్యంపై ఐఎన్టీయూసీ మిత్రపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్(జేసీఎల్)వరంగల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గౌతమికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఐఎన్టీయూసీ మిత్రపక్షాల ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా యాజమాన్యం, గుర్తింపు సంఘం మధ్య 14వ వేతన ఒప్పంద చర్చలు సాగుతున్నప్పటికీ ఇప్పటికీ తుది నిర్ణయం తీసుకోకపోవడం కార్మికులకు తీవ్ర నిరాశ కలిగిస్తోందన్నారు. పరిశ్రమలో ఉత్పత్తి 70వేల టన్నుల నుండి 8లక్షల టన్నులకు పెరిగినా, కార్మికుల జీవన ప్రమాణాల్లో మార్పులు లేకపోవడం బాధాకరమన్నారు. గత ఎన్నికల సమయంలో గుర్తింపు సంఘం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రతి కార్మికునికి నెలకు రూ 22వేల వేతన పెంపు, 100శాతం అన్‌లిమిటెడ్ మెడికల్ సదుపాయం, రూ 12లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, 10 గ్రామాల బంగారు నాణెం, శ్రీరామనవమికి పెయిడ్ హాలిడే, వీడీఏ పాయింట్‌కు రూ 6పెంపు వంటి హామీలు ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం గుర్తింపు సంఘం వైఫల్యానికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె నోటీసులు ఇచ్చి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉన్నందున, వెంటనే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని జేసీఎల్ అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో ఐఎన్టీయూసీ మిత్రపక్షాల నాయకులు వినోద్, సలీం, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సాయిరాం, కూచిపూడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## తిప్పారెడ్డిగూడెంలో ఘనంగా రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన





ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండల పరిధి లోని తిప్పారెడ్డిగూడెం గ్రామం లో ప్రజల చిరకాల కోరికను సహకారం చేసేందుకు గ్రామ పెద్దలు రామాలయాన్ని నిర్మించడానికి కంకణ బద్ధులై ఆలయ ర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల సహకారంతో సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. రామాలయ నిర్మాణానికి గ్రామ పెద్దలు అంకురార్పణ చేయడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ముందుగా వేద పండితులు గ్రామాల్లోని పుసులూరి రమేష్ బేబీ,పుసులూరి శ్రీనివాస్ సునీత, పుసులూరి రాకేష్.సుగుణ, పుసులూరి కృష్ణయ్య మంగతాయి, పుసులూరి రాము మమత, పుసులూరి మధు సృజన దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శంకుస్థాపన కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శంకుస్థాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది గ్రామస్తులంతా జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించి దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన పుసులూరి రజిని జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఎన్నారై పుసులూరి సాకేష్ మూడు గుంటలు, ధ్వజస్తంభం ఏర్పాటుకు అంగీకరించినట్లు వారు తెలిపారు. పుసులూరి యేసయ్య జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు 30 గజాల స్థలాన్ని రామాలయానికి కేటాయించారు అని వారు తెలిపారు. రామాలయ నిర్మాణానికి గ్రామస్తులంతా సహకరించినట్లయితే ఆరు నెలల్లో రామాలయాన్ని పూర్తి చేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం ఉపేందర్ ఉప సర్పంచ్ పుసులూరి రమేష్, అచ్చ బాబు, పోట్ల వాసయ్య, అచ్చ ఉప్పలయ్య మాజీ సర్పంచ్ వేల్పుల వీరన్న, వేల్పుల సైదులు, ఎల్దా శోభన్ రావు పోలే పొంగు ఉప్పలయ్య, ఎంఎల్, పుసులూరి శ్రీనివాస్, సంగె పొంగు శ్రీను, వేల్పుల వెంకటేష్, పిడమర్తి రాజేష్, పేరం వెంకటేశ్వర్లు, గోకినపల్లి వెంకన్న వేద పండితులు అర్చకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్లు, మొక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి



ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీలలో ఎక్కువ మంది రైతులు యాసంగి పంటలు వడ్లు, మొక్కజొన్నలు వేశారని ఆ పంటలు కోతలకు వచ్చాయని వాటిని అమ్ముకోవడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి భానోతు ధర్మ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందగా మారిందని. ఈ ప్రభుత్వం పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానంవల్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. గత సంవత్సరం వానాకాలం ఎండాకాలంలో పండించిన పంటలకు బోనసు ఇస్తామని చెప్పిన కొంతమందికి మాత్రమే వారి ఖాతాలో జమాయిన ఇంకొంతమందికి ఇప్పటివరకు బోనస్ జమ చేయకపోవడం రైతాంగం పట్ల ప్రభుత్వ అనుసరిస్తాను నిర్లక్ష్య వైఖరి అని వారు అన్నారు. ఇప్పటికైనా రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వారి పంటను సరసమైన ధరకు అమ్ముకునే విధంగా వారిని కాపాడాలని వారు గుర్తు చేశారు. గత సంవత్సరం మొక్క రైతులు విత్తన కంపెనీలతో అనేక ఇబ్బందులకు గురయ్యారని వారి పంటకు వచ్చే డబ్బులు రాకపోవడంతో ఆందోళన చెందారని కంపెనీ ఏజెంట్ల పై పోలీసు కేసులు పెట్టారని వారు తెలియజేశారు. స్థానిక అధికారులు ఈ విషయాన్ని గమనించి రైతులకు ఎటువంటి దళారుల వ్యవస్థ దోపిడీ జరగకుండా రైతులను కాపాడాలని వారు ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు జే. నరసింహారావు, పొరుపల్లిబాబురావు, లింగాల వీరభద్రం, టి నరేష్ జి లక్ష్మణ్, శ్రీను, స్వామి, బాలు బిక్షమయ్య, సక్రు తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో రోడ్డు భద్రత వారోత్సవాలు



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలో రోడ్డు భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మండలంలోని వివిధ గ్రామాలలో గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమాలకు అన్నపురెడ్డిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయసింహారెడ్డి ప్రధాన అతిథిగా హాజరై ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ విజయసింహారెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని ఆయన స్పష్టంగా తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, యువకులు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ట్రాఫిక్ నియమాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీసులు ప్రజలకు రోడ్డు భద్రతపై పలు కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. బుచ్చన్నగూడెం, జానకిపురం గ్రామాల మధ్యలో ఉన్నటువంటి రోడ్డుపై గుంతలను మట్టితో నింపారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పెంపొందిస్తాయని అన్నారు. ఈ రోడ్డు భద్రత వారోత్సవాలు మండలంలో మంచి స్పందనను పొందాయి. ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ తమ ప్రాణాలను రక్షించుకోవాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎస్ఐ సోమేశ్వర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అలాగే రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శిరీష, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## రేణుకను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాచలం : రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. భద్రాచలంలోని ఐదు గ్రామపంచాయితీల విలీన కార్యక్రమానికి వస్తున్న ఆమెను ఆయన పాల్వంచలోని నవభారత్ అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం జిల్లా సమస్యల, పరిస్థితులు, స్థితిగతులు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు కొద్దిసేపు ముచ్చటించారు.

## విపత్తులను విద్యార్థులు ఎదుర్కోవాలి

ప్రజాపక్షం/భద్రాచలం : అనుకోకుండా సంభవించే విపత్తులను విద్యార్థులు సైతం మనోధైర్యంతో ఎదుర్కొని తమను తాము రక్షించుకోవడంతోపాటు ఇతరులను కూడా కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రినిస్పల్ డా. జాన్ మిల్టన్ అన్నారు,. సోమవారం స్థానిక కాలేజీలో ఎన్డిఆర్ఎఫ్ బృంధం విపత్తులను ఎదుర్కొనే అంశాలపై వివరించారు. ఈసందర్భంగా మిల్టన్ మాట్లాడుతూ విద్యార్థులు అధైర్యపడకుండా విపత్తులను ఎదుర్కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డిఆర్ఎఫ్ బృంధంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి

ప్రజాపక్షం/కొత్తగూడెం : ప్లాస్టిక్ వాడకం తగ్గిచడం ద్వారా క్యాన్సర్ ముప్పు నుండి భయటపడవచ్చని జిల్లా వైద్యాధికారి డా.తుకారామ్ రాథోడ్ అన్నారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం జీవితంలో భాగమైందని, దీని వల్ల అనార్థాలతో పాటు తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ప్లాస్టిత్ పాటు నూనె రీసైక్లిన్ చేసి వాడుతున్నందు వల్ల క్యాన్సర్ కణాలు శరీరంలోనికి ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ప్రతీ రోజు ఐదు లీటర్ల నీరు తాగాలని, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయి కళ్యాణ్, రామ్‌దాస్, సోమ్లా, రాంప్రసాద్, కుమార స్వామితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## స్నేహితుడు కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన పూర్వ విద్యార్థులు

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మానవత్వం ఇంకా బ్రతికే ఉందని చాటి చెబుతూ పూర్వ విద్యార్థులు తమ స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదర్శంగా నిలిచారు. ఒకే పాఠశాలలో చదువుకున్న స్నేహితుడు ఆకస్మిక మరణ వార్త తెలుసుకున్న వెంటనే సహచరులు కలిసి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. మండల పరిధిలోని పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994 95 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమతోపాటు చదివిన పిండిప్రోలు గ్రామానికి చెందిన ఐయితనబోయిన రవి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా అతని కుటుంబ సభ్యులకు 26 వేల రూపాయలను అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, స్నేహం అనేది కేవలం చదువుకునే రోజులకే పరిమితం కాకుండా జీవితాంతం కొనసాగాల్సిన బంధమని తెలిపారు. కష్టసమయంలో తోడుగా నిలవడం నిజమైన స్నేహానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో మీగడ సైదులు, మేకల సత్యనారాయణ, మడికంటి స్కైలాబ్, నామ శరత్, రామనబోయిన వెంకటేశ్వర్లు, తూము వెంకటేశ్వర్లు, భాష బోయిన వీరభద్రం, గుర్రాల రాజకుమార్ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణం

### ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం చేయాలి :- కలెక్టర్



ప్రజాపక్షం/ కొత్తగూడెం : రోడ్డు ప్రమాదాకు మానవ తప్పిదాలే కారణమని, ఆ ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం జరగాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రగతి ప్రణాళిక కార్యచరణలో భాగంగా ఈనెల 18 వరకు నిర్వహించనున్న అరైవ్ అలైవ్ రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాల గోడపత్రికను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమన్నారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నియమాలు పాటింపు తప్పనిసరి అని సూచించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు, అవగాహన ర్యాలీలు, పాఠశాలలు, కళాశాలల్లో చైతన్య కార్యక్రమాలు, డ్రైవర్లకు శిక్షణా శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా ఆధికారి వెంకటరమణతో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/భద్రాచలం : ఆదివాసీ గ్రామాల నుండి వచ్చి సమస్యలపై వినతులు సమర్పించే గిరిజనుల సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మదిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరై ఆయన పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించామని, వాటిని సంబంధిత అధికారులకు బట్వాడా చేసినట్లు తెలిపారు. అందిన వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు అధికారులు పాటుపడాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు వెంటనే ఇవ్వాలన్నారు. అర్హత గల ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు పాల్గొన్నారు.

## పల్లెటూరి కుసుమానికి ఘన సన్మానం



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధిలోని సీతంపేట బంజర గ్రామానికి చెందిన భూక్య లిఖిల్ ఇంటర్‌మీడియట్ రెండవ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 973 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. ఏన్కూర్‌లోని ప్రభుత్వ గురుకుల కళాశాలలో విద్యనభ్యసించిన లిఖిల్, మొదటి సంవత్సరం నుంచే మంచి ప్రతిభ చూపించి, రెండవ సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాన్ని సాధించాడు. ఈసందర్భంగా గ్రామంలో స్థానిక సర్పంచ్ గుగులోత్ జానకిరామ్, ఎస్ఐ రమాదేవి, వార్డు సభ్యులు కలిసి లిఖిల్‌ను దుశాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఇతర విద్యార్థులను కూడా అభినందించారు. ఈసందర్భంగా గ్రామస్తులు, పలు కుటుంబాల సభ్యులు విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఎత్తిపోతల పథకం పునః ప్రారంభించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: విశ్వనాథపల్లి గ్రామంలోని ఎత్తిపోతల పథకం నిలిచిపోవడంతో 200 ఎకరాలపైగా భూమి సాగు దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2000లో ఏర్పాటు చేసిన ఈ పథకం ద్వారా 107 మంది రైతులకు లాభం కలిగేది. కానీ మోటార్లు పాడవడం, మరమ్మతులు లేకపోవడంతో ప్రస్తుతం నిర్వీర్యమైంది. మోటార్లు దొంగిలించబడినట్లు కూడా రైతులు తెలిపారు. సర్పంచ్ ఇస్లావత్ రాజు ఆధ్వర్యంలో రైతులు పథకాన్ని పరిశీలించి, వెంటనే మోటార్లు ఏర్పాటు చేసి పునఃప్రారంభించాలని కోరారు. జిల్లా మంత్రులు స్పందించి పథకాన్ని తిరిగి ప్రారంభిస్తే రైతులకు మేలు జరుగుతుందని విజ్ఞప్తి చేశారు.

## రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీ నిర్వహణ



ప్రజాపక్షం/పినపాక: రోడ్ సేఫ్టీ ప్రణాళికలో భాగంగా పినపాక మండలం తొగూడెం గ్రామంలో సర్పంచ్ పూణెం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలుఉ తప్పని సరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించండి...ప్రాణాలను కాపాడండి, మితి వేగం..సురక్షిత ప్రయాణం వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ అచ్చా నవీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సతీష్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

**-ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కల్లూరు మండలం చంద్రుపట్లకు చెందిన ప్రజలు గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలం ఆక్రమణకు గురైందని దానిని సంరక్షించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం ముత్యాలగూడెంకు చెందిన స్వప్న తనకు మతిస్థిమితం సరిగ్గా ఉండదని సదరం సర్టిఫికెట్ ఉందని దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఎ. దేవేందర్‌రావు రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు ద్వారా రాపల్లిలో క్రయం పొందిన వ్యవసాయ భూమిని నకిలీ సాదాబైనామా ద్వారా సునీల్ పేరున మార్పిడి చేసి కొత్త పాసుపుస్తకం మంజూరు చేశారని దానిని రద్దు చేసి తన పేరుపై పట్టాపాసుపుస్తకం మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామవాసులు పెద్దమ్మతల్లి దేవాలయ స్థలాన్ని కొంత మంది ఆక్రమణ చేస్తున్నారని దానిని సర్వే చేయించి భవిష్యత్తులో ఆక్రమణలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. ఆయా వినతులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రాపల్లి విద్యార్థికి రాష్ట్రస్థాయి ఐదవ ర్యాంకు






**ప్రజాపక్షం/ బోనకల్ :** రాపల్లి గ్రామానికి చెందిన ఏలూరి శ్రీవాత్సవ్ సాయి ఎంఈసిలో రాష్ట్ర స్థాయిలో ఐదవ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్ కుకట్‌పల్లిలోని అవినాష్ కళాశాలలో ఎంఈసి గ్రూప్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రీవాత్సవ్ సాయి 500 మార్కులకు 492 మార్కులు సాధించి అత్యుత్తమ ఫలితాన్ని సాధించారు. ప్రస్తుత ట్రెండ్‌కు భిన్నంగా ఇంటర్‌లో ఎంఈసి గ్రూపును ఎన్నుకున్న ఈ వాత్సవ్ తదనుగుణంగానే మంచి మార్కులు సాధించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు. శ్రీ వాత్సవ్ తండ్రి శ్రీకాంత్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నారు. శ్రీవాత్సవ్ రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించి రాపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకు వచ్చాడని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని గ్రామానికి చెందిన పలువురు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. కళాశాల యాజమాన్యం శ్రీవాత్సవ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ రూ. 10వేల నగదు పారితోషికాన్ని అందజేసింది.

# ముగిసిన పది పరీక్షలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ముగిశాయి. 638 మంది విద్యార్థిని విద్యార్థులు మార్చి 14 నుంచి నాలుగు కేంద్రాలలో వంద మంది సిబ్బంది మౌలిక వసతులలో విద్యార్థిని విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలను రాశారు. విద్యాశాఖ పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి నివేదిత తెలిపారు. పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పర్యవేక్షకులు అందరూ సహకరించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదములు ఎంఈఓ తెలిపారు.

# ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన కార్తీక్



**ప్రజాపక్షం/బోనకల్:** ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో 1000 మార్కులకు గానూ 980 మార్కులు బానోత్ కార్తీక్ సాధించాడు. మండల కేంద్రానికి చెందిన బానోత్ మురళి, జ్యోతిల కుమారుడైన కార్తీక్, ఖమ్మంలోని కృష్ణవేణి కాలేజిలో చదువుతూ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. చిన్ననాటి చదువును రావినూతల వాణి విద్యాలయంలో పూర్తిచేశాడు. అనంతరం కార్తీక్ 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించాడు. తండ్రి బానోత్ మురళి కాంగ్రీట్ పనుల మేస్త్రీగా ఇద్దరు కుమారులకు మంచి విద్యను అందిస్తున్న తీరును గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు. కార్తీక్ విజయం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. గ్రామానికి గర్వకారణంగా నిలిచిన కార్తీక్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శిగా యంగల



**ప్రజాపక్షం/బోనకల్:** దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నూతన కార్యదర్శిగా యంగల ఆనందరావు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి 2వ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభలో 31 మంది కౌన్సిల్ సభ్యులుగా, 18 మంది కార్యవర్గ సభ్యులుగా, 11 మంది ఆఫీస్ బేరర్లుగా ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆనందరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో దళిత హక్కుల పోరాట సమితి పక్షాన దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, దళితుల అభివృద్ధికై అనేక పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. తమ ఎన్నిక పట్ల కృషి చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా సమతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నిక పట్ల సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయలు, ఏనుగు గాంధీ, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, బత్తినేని నీరజ, జక్కుల రామారావు, సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పారుపల్లి నరసింహారావు, ఆకెన పవన్, మాతంగి శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

# అక్రమంగా దాచిన నెమలి స్వాధీనం

**- విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు : ఫారెస్ట్ డిఆర్ఓ**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం తీర్థాల గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా దాచిపెట్టిన నెమలిని అటవీశాఖ అధికారులు సోమవారం స్వాధీనపరుచుకున్నారు. గ్రామస్థులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన కిషన్ అనే వ్యక్తి తన ఇంట్లో నెమలిని ఉంచాడనే ఫిర్యాదు మేరకు అటవీశాఖ డిఆర్ఓ రామారావు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆ ఇంట్లో నెమలి ఉన్నట్లు గుర్తించి, గ్రామస్థుల సహకారంతో దానిని స్వాధీనపరుచుకున్నారు. గత కొన్ని రోజుల క్రితం జింకలను వేటాడి భుజించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అలాగే రెండు నెమలులకు గాను ఒకదానిని భుజించగా మరో నెమలిని ఇంట్లో పెంచుతున్నట్లు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై డిఆర్ఓ రామారావును వివరణ కోరగా...పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతున్నదని, విచారణలో ఆరోపణలు నిజమని తేలితే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# రోడ్డు భద్రత మనందరి బాధ్యత




**ప్రజాపక్షం/ మధిర :** రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని మధిర టౌన్, రూరల్ సిఐలు రమేష్‌బాబు, డి.మధులు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మధిర డిపో మేనేజర్ రామయ్య ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నవిత, పోలీస్ సిబ్బంది, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# పది విద్యార్థులకు ఘన వీడ్కోలు




**ప్రజాపక్షం/చింతకాని :** నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థు లు ఉన్నతంగా ఎదగాలని పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ సూచించారు. విద్యార్థులు సానుకూల దృక్పదంతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అకుంఠిత దీక్షతో ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగినప్పుడు అనుకున్న గమ్యాన్ని చేరుతారన్నారు. విద్యార్థులు పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్బంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోళ్ల రేణుక, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పుల్లారావు, సుధాకర్, ప్రశాంతి, పార్వతి, సుజాత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని, వీధుల్లో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత ప్రజలకు సూచించారు. సోమవారం మధిర పట్టణంలోని 12వ వార్డు పరిధిలో డ్రైనేజి వ్యవస్థను చైర్మన్ సుజాత, వార్డు కౌన్సిలర్ మోదుగు నాగలక్ష్మి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన, రోడ్డుపై ఉన్న చెత్తచెదారాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలన్నారు. చెత్తను రోడ్డు, డ్రైనేజిల్లో పడేయకుండా మున్సిపల్ వాహనాల్లో వేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులతో మాట్లాడి తగు సూచలను చేశారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇన్స్పెక్టర్ శివకృష్ణ, మేస్త్రీ నరేష్, స్థాని నేతలు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మెప్మా ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ నందు వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు సోమవారం ప్రారంభించారు. ఈ సంరద్భంగా వారు మాట్లాడుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు న్యాయం చేయాలని ఉద్దేశ్యంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులకు నష్టం కలిగించకూడదని, రైతుని రాజు చేయాలనే ఉద్ధేశ్యంతో రైతులకు మేలు కల్పించడమే లక్ష్యంతో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోనా ధనికుమార్, కమీషనర్ సంపత్‌కుమార్, 22వ వార్డు కౌన్సిలర్ నాగార్జున కాంగ్రెస్ నాయకులు రామనాధం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతే భద్రతకు ప్రధాన సూత్రం



**ప్రజాపక్షం/ తల్లాడ :** రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు జరుగుతున్న సందర్భంగా తల్లాడ పోలీస్ శాఖ అన్నారుగూడెం పంచాయతీ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యత మెలిగిననాడే భద్రత దొరుకుతుందని, ప్రస్తుతం తరుణంలో స్పీడుగా ఉన్న ఈ యుగంలో ప్రతిఒక్కరూ పనిని త్వరగా ముగించుకోవాలన్న ఆలోచనలతో తొందరపడుతూ ప్రథమంగా మనం నిర్వహించాల్సిన బాధ్యత మర్చిపోతున్నామని, ఎప్పుడైతే మనం బాధ్యతను గౌరవిస్తూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే భద్రత కూడా అదే క్రమంలో దొరుకుతుందని ఈసందర్భంగా అభిప్రాయపడ్డారు. ముందుగా రోడ్డు భధ్రత వారోత్సవాల ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోలీస్‌శాఖ వారు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, మోటార్ ఫీల్డ్ యజమానులు, వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు, పంచాయతీ సిబ్బంది, యువకులు తదితరుల పాల్గొన్నారు.

# ఘనంగా టిఎస్ యూటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కేంద్రం ఎర్రుపాలెంలో సిపిఎస్ నందు టిఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్స వేడుకలు సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు సోమవారం యూటిఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా టిఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పిఆర్సి ఇవ్వాలని, సిపిఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నంద్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు నీలం సైదారావు, కోశాధికారి టి.వెంకటకృష్ణ, కార్యదర్శులు ఆర్.భరత్, సుధాకర్, పుల్లారావు, ఎం.నాగేశ్వరరావు, సతీష్, నాగరాజు, కాజా మొహీద్దీన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

**-ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షకు పెరుగుతున్న మద్దతు**
**-దీక్ష శిబిరాన్ని సందర్శించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్‌రెడ్డి**







**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఐటీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు రోజు రోజుకు మద్దతు పెరుగుతోంది. 19 రోజులుగా ఎండలో కొనసాగుతున్న ఈ దీక్షకు వివిధ రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాజేష్‌రెడ్డి, బిఆర్ఎస్ స్టేట్ యూత్ నాయకులు పురుషోత్తం యాదవ్, బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి దీక్ష శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కోరారు. 19 రోజులుగా కార్మికులు ఎండలో దీక్షలు చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం సరైన విధానం కాదన్నారు. త్వరలోనే కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని హెచ్చరించారు. లేకపోతే కాంట్రాక్ట్ కార్మికుల తరపున బిఆర్ఎస్ పార్టీ కూడా వారితో కలిసి సమ్మెకు దిగేందుకు వెనకాడదని స్పష్టం చేశారు. అనంతరం దీక్షలో పాల్గొన్న కార్మికులకు నిమ్మరసం ఇచ్చి ఆ రోజు దీక్షను విరమింపజేశారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, ఆకినీ సర్వేశ్వరరావు, జేఏసీ సభ్యులు మర్రి వెంకట్‌రెడ్డి, సారపాక టౌన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కొనకంచి శ్రీను, బిఆర్ఎస్ నాయకులు కోమటిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గోపాల్, సాయి, బిఆర్ఎస్ మండల నాయకులు, ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద నివారణకు కృషి చేయాలి




**- స్వీయ నియంత్రణ పాటించాలి**

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రతీ ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించి రోడ్డు ప్రమాద నివారణకు కృషి చేయాలని జిల్లా ఎస్‌పి. బిరుదు రాజు రోహిత్‌రాజు అన్నారు. పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఎంసిబిటి ఐటిఐ కళాశాలలో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు అరైవ్, అలైవ్ అవగాహనా సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై ఆరు రోజుల పాటు అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో అరైవ్, అలైవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత డిఫెన్సివ్‌డ్రైవింగ్ నియమాలపై విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించటంలో స్వీయ ప్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. దీనితో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయటానికి వీలు కలుగుతుందన్నారు. రోడ్‌పై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు లేకపోయినా వాహనాలను నడిపేటపుడు నియమ నిభంధనలు ప్రతీ ఒక్కరు పాటించే విధంగా సివిక్ సెన్స్ కలిగి ఉండాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిభంధనలను పాటించి తమ ప్రాణ భద్రతతో పాటుగా ఇతరుల భద్రతకు భరోసా కల్పించాలని సూచించారు. డ్రంకండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రుట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి తెలిపారు. విద్యార్థి దశలో ప్రతీ ఒక్కరుతమ తల్లిదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా నడుచుకొంటూ ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్‌ను పొంది సమాజానికి మార్గదర్శకంగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, ఆర్‌డిఓ వెంకటరమణ, మెడికల్ ఆఫీసర్ రాం ప్రసాద్, ఎన్‌హెచ్‌ఏఐ జేఈ మొహమ్మద్ అలీ, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, సిఐ.సతీష్, ఎస్‌ఐలు టి. నాగరాజు, జీవన్‌రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్‌రెడ్డి ఆశయాల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ పిలుపు**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** వెంకట్‌రెడ్డి ఆశయాల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గౌతమినగర్ కాలనీ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు కామ్రేడ్ వెంకట్‌రెడ్డిగ దశ దిన కర్మల సందర్భంగా నిర్వహించిన స్మారక సభ గంభీరంగా జరిగింది. ఈ సభకు హాజరైన ఆయన వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్‌రెడ్డి పేద ప్రజల హక్కుల కోసం, కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన మహానేత అని కొనియాడారు. వారి సేవలు, త్యాగాలు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, మండల అధ్యక్షులు రాయపేడి రాజేష్, నాయకులు మేలపూర సురేందర్‌రెడ్డి, ఈనపల్లి పవన్ సాయి, కృష్ణార్జునరావు గోపిరెడ్డి, అంతయ్య జక్క పాల్గొన్నారు.

# చుంచుపల్లిలో రోడ్డు భద్రత వారోత్సవాలు









**ప్రజాపక్షం /చుంచుపల్లి :** 99 రోజుల ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రత మీద అవగాహనా కల్పించాలనే ఉద్దేశ్యంతో సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహించారు. ఇందులో భాగంగా బాబూక్యాంప్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ మనోహన్, సహకారులు సురేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూనావత్ కుమారి, ఉప సర్పంచ్ పొలమూరి శ్రీనివాస్, పంచాయతీ సెక్రెటరీ సురేష్, వార్డు మెంబర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే విద్యానగర్ గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్‌తో పాటు సర్పంచ్ భూక్యా శాంతి శ్రీ, పంచాయతీ సెక్రెటరీ కె.వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు, ఆశావర్కర్లు తదితురులు పాల్గొన్నారు. రామాంజనేయ కాలనీలో జరిగిన గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్‌తోపాటు సర్పంచ్ సరిత ఠాగూర్, పంచాయతీ సెక్రెటరీ యం.రమేష్, వార్డు మెంబర్లు, ఆశావర్కర్లు తదితురులు పాల్గొని మండలంలో జరిగిన రోడ్డు భద్రతా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# మృతి చెందిన రమేష్ కుటుంబానికి చంద్రు ఫౌండేషన్ సాయం

**-పిల్లల విద్యకు సహాయం చేస్తామని హామీ**



**ప్రజాపక్షం/కారేపల్లి:** మేకలతండ గ్రామానికి చెందిన అంగోత్ రమేష్ రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. కుటుంబానికి ఆధారంగా ఉన్న రమేష్ ఆకస్మిక మరణంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ దుర్ఘటన పట్ల స్పందించిన చంద్రు ఫౌండేషన్ సీఈఓ భూక్య వీరన్న(టీచర్)మానవత్వాన్ని చాటుతూ మృతుడి కుటుంబానికి 25కేజీల బియ్యం, రూ 1000నగదు అందజేశారు. ఈ క్లిష్ట సమయంలో సహాయం చేసి కుటుంబానికి కొంత ఊరటనిచ్చారు. అలాగే చిన్న పిల్లలిద్దరికీ ప్రాథమిక విద్యకు అవసరమైన సామాగ్రిని ఫౌండేషన్ ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మంగత్య నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భూక్య నాగేశ్వరరావు, కబీర్, ఆంగోత్ విజయ్, స్వచ్ఛ్ యూత్ సొసైటీ అధ్యక్షులు భూక్యా వినోద్ కుమార్, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# పోషణ పక్వాడ కార్యక్రమం విజయవంతం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మోరంపల్లిబంజర్ సెక్టార్‌లో గల వేపలగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం సూపర్వైజర్ స్వరాజ్యం ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయంగా సీమంతం, చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా  స్థానిక సర్పంచ్ బొల్లి నిరోష పాల్గొని మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవడం అత్యంత అవసరమన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన పెరుగుదలకు సమతుల్య ఆహారం కీలకమని తెలిపారు. తల్లులు ఇంట్లో లభించే పదార్ధాలతోనే పోషకాహార వంటకాలు తయారు చేసి పిల్లలకు అందించాలన్నారు. అనంతరం సూపర్వైజర్ స్వరాజ్యం మాట్లాడుతూ అన్నప్రసన్న కార్యక్రమం ద్వారా చిన్నారులకు సరైన సమయంలో అదరపు ఆహారం ప్రారంభించడం ఎంతో ముఖ్యమో వివరించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమాల ద్వారా గ్రామస్తులలో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని అన్నారు. ఈకార్యక్రమంలో పోషణ అభియాన్ బృందం, అంగన్‌వాడదీ టీచర్లు, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం




**ప్రజాపక్షం/పాల్వంచ :** హెల్మెట్ లేకుండా వాహన ప్రయాణం ప్రమాదకరమని పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. భూక్యా సురేష్ అన్నారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల పరిధి కేశవాపురం గ్రామ పంచాయితీలో సర్పంచ్ బాలు అధ్యక్షతన అరైవ్, అలైవ్ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్ఐ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైల్మెట్ లేకుండా ప్రయాణం చేయటం ప్రమాదమన్నారు. పాఠశాలకు వెళుతున్న విద్యార్థులకు వాహనాలు ఇవ్వకూడదని, అవసరమైతే తల్లిదండ్రులే స్కూల్ తీసుకెళ్ళి రావాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం సాగించే ఇద్దరు వ్యక్తులు హెల్మెట్ ధరించాలని సూచించారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపటం నిషేధమన్నారు. వాహన డ్రైవర్లు ప్రతీ రెండు గంటలకు ఒకసారి తగిన విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిభంధనలు తప్పకుండా పాటించి ప్రమాదాల నివారణకు పాటుపడాలని కోరారు. గ్రామంలోని రోడ్డు భద్రతా కమిటీలు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బొగ్గా నారాయణ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మండల స్థాయి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతాంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులకు రైతు భరోసా నిధులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. అలాగే సీతారామ ప్రాజెక్ట్ కాలువల ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, మలోతు రావూజ, గౌరి నాగేశ్వరరావు, నిమ్మల మధు, కుంజా రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో రాష్ట్ర మూడో ర్యాంకు సాధించిన వర్షిత్

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఇంటర్మీడియట్ రెండో సంవత్సర ఫలితాలలో కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన ఎంపీసీలో పాటి వర్షిత్ 994/1000 మార్కులు సాధించి టాఫర్‌గా నిలిచాడు. పాటి శ్రీనివాసరావు, ఉమ దంపతుల కుమారుడైన వర్షిత్ చిన్న తనం నుండే చదువులో చురుకుగా ఉండే వాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు కావడంతో పిల్లల చదువుల కోసం జిల్లా కేంద్రం ఖమ్మం వచ్చి ప్రైవేటు హాస్టల్ పెట్టి తమ జీవనోపాధితో పాటు పిల్లలను చదివించారు. ఖమ్మం నారాయణ కళాశాలలో ఇంటర్ నభ్యసించిన వర్షిత్ తల్లిదండ్రులు ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించాడు.

# జీరో మాతృశిశు మరణాలే లక్ష్యం

**-హై రిస్క్ గర్భిణీల గుర్తింపు, ప్రత్యేక పర్యవేక్షణ**
**-పాఠశాలల్లో పోక్సో అవగాహన, పిల్లల భద్రతపై ప్రత్యేక చర్యలు : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/వైద్యవిభాగం:** జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాలు లక్ష్యంతో ప్రణాళికాబద్ధంతో అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మాతృ, శిశు మరణాలు తగ్గింపు, సంక్షేమ శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్లు డాక్టర్ పి శ్రీజ, పి శ్రీనివాసరెడ్డిలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రతి ప్రసవం సురక్షితంగా జరుగుతుందనే సందేశం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాల లక్ష్య సాధనకు అన్ని విభాగాలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అన్నారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో హై రిస్క్ గర్భిణీలను తప్పనిసరిగా గుర్తించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం 12 నుండి 15 శాతం గర్భిణీలు హై రిస్క్ కేటగిరిలో ఉంటారని తెలిపారు. ఏ పిహెచ్‌సి హై రిస్క్ కేసులు లేవని నివేదిస్తే గుర్తింపు ప్రక్రియలో లోపాలు ఉన్నట్లేనని, అలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న హై రిస్క్ గర్భిణీలను ఒక్క వారం లోపు పూర్తి స్థాయిలో గుర్తించి, వారి కోసం బర్త్ ప్లానింగ్ సిద్ధం చేయాలని సూచించారు. ఆరోగ్యశాఖలో అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించి ప్రతి పిహెచ్‌సికి అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ వారం నిర్వహించి, సున్నిత వర్గాల పిల్లల పూర్తి స్థాయి డేటా సేకరించి చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలు, అనాథలు, బాల కార్మికులు, సదరం కేటగిరీ పిల్లల వివరాలు సమగ్రంగా సేకరించి, అన్ని శాఖలతో సమన్వయం చేసి వారికి ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని తెలిపారు. పాఠశాలల్లో పోక్సో చట్టం అమలు బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించి, బాలలపై దుర్వినియోగాన్ని గుర్తించేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో పిల్లల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ఐసిడిఎస్, విద్యాశాఖలు ఈ అంశంపై పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యసమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన చికిత్స అందించాలనీ, అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించాలన్నారు. ఆర్‌బిఎస్‌కె బృందాలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. మాతృ, శిశు మరణాల ప్రతి ఘటనను విశ్లేషించి కారణాలను గుర్తించి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మాతృ, శిశు మరణాల ప్రతి ఘటనను విశ్లేషించి గుర్తించి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది చురుకుగా పనిచేసి గర్భిణీల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, డిడబ్ల్యుఓ వేల్పుల విజేత, డిసిపిఓ విష్ణువందన, విద్యా శాఖ సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమనిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి వాటి నివారణకు సహకరించాలని తహశీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీధర్‌రాజు, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ బాధ్యతగా ఉంటూ ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని, ప్రమాదాల్లో ప్రాణం నష్టం జరిగితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని, అందరూ బాధ్యతగా వ్యవహరిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కాజా మోహినుద్దీన్, ఈఓ కృష్ణారావు, హెడ్ కానిస్టేబుల్ చెన్నారావు, మహిళలు, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

## అనాధల ఆకలి తీర్చేడమే అసలైన సంబరం




**ప్రజాపక్షం/వైరా:** రేచర్ల శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా ఆయన సోదరులు కాంగ్రెస్ యువ నాయకుడు రేచర్ల వెంకటేష్ చేసిన సేవా కార్యక్రమం నిజంగా అభినందనీయం అని పలువురు కొనియాడారు. చిల్డ్రన్ గ్రోత్ చారిటబుల్ ట్రస్ట్‌లోని వందలాది మంది అనాథ పిల్లలకు అన్నదానం చేయడం వారి ఉదారతకు నిదర్శనం. తోటి వారి ఆకలి తీర్చడంలో ఉండే తృప్తి మరెందులోనూ లేదని నమ్మి తన అన్న పుట్టిన రోజును ఇలాంటి అర్థవంతమైన కార్యక్రమంతో జరపడం ద్వారా వెంకటేష్ సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని అందించారు. రేచర్ల సోదరులు మధ్య ఉన్న అనుబంధం కేవలం కుటుంబానికి పరిమితం కాకుండా సామాజిక బాధ్యతగా రూపుదిద్దుకోవడం స్ఫూర్తిదాయకం. మన నాయకుడిగా ఎదుగుతున్న వెంకటేష్ సమాజం పట్ల ఉన్న నిబద్ధత, శ్రీకాంత్ పట్ల ఆయనకు ఉన్న ప్రేమ. ఈ సేవా రూపంలో వ్యక్తమయ్యాయి. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుండే ఈ సోదరుల సేవా గుణం మరెంతో మంది యువతకు మార్గదర్శకంగా అని పలువురు తెలిపారు.

# ప్రణాళిక లేకుండా మార్కెట్ ఆధునీకరణ పనులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ పనులు ప్రణాళిక లేకుండా జరుగుతున్నాయని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుండాల కృష్ణ ఆరోపించారు. సోమవారం ఖమ్మంలో ఆయన క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ త్రీటౌన్ ప్రాంత ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గుండాల కృష్ణ మాట్లాడుతూ రూ. 150 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ స్థాయిలో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో మాత్రం ముందస్తు ప్రణాళిక లేమితో వాస్తు దోషంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఆధునీకరణ పనులకు సంబంధించి చాంబర్ ప్రతినిధులు రైతు సంఘాలతో సమావేశాన్ని నిర్వహించి సలహాలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. మార్కెట్ లోపల ప్రాంగణాన్ని పెంచుతూ చుట్టు ఉన్న రోడ్లన్నింటిని తగ్గించడం వల్ల భవిష్యత్తులో రవాణాకు తీవ్ర ఇబ్బందులు వస్తాయన్నారు. మార్కెట్ చుట్టూ ఉన్న 40 అడుగుల రోడ్డును 25 అడుగులకు కుదిస్తూ అభివృద్ధి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భవిష్యత్తులో పెద్ద మొత్తంలో మిర్చి మార్కెట్‌కు తరలి వస్తే వాహనాల రవాణాకు ఇబ్బందులు వస్తాయన్నారు. మార్కెట్‌లో ఉద్యోగుల కొరత కూడా తీవ్రంగా ఉందని వెంటనే నియామకాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వమే కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్ల నిర్మాణాలు చేపట్టి రైతులు ఉచితంగా పంటలు దాచుకునేవిధంగా వెసులుబాటు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పసుమర్తి రాంమోహన్‌రావు, బిఆర్ఎస్ నాయకులు కస్తూరి లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా ప్రతి ఒక్కరి బాధ్యత

**-అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా ర్యాలీ**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రోడ్డు భద్రతా ప్రతి ఒక్కరి బాధ్యత అని టిజిఎస్ ఆర్టీసి ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాత బస్టాండ్ నుంచి ప్రారంభమై మయూరిసెంటర్, బస్ డిపో వరకు నిర్వహించారు. పాత బస్టాండ్‌లో ఈ ర్యాలీని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్, ఆర్టీఓ కార్యాలయ అధికారి దినేష్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్లక్ష్యం ప్రాణ నష్టాలకు దారి తీస్తుందన్నారు. వాహనదారులు రోడ్డు నియమాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. అతివేగం నివారించడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు సీట్ బెల్ట్ వినియోగించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రతకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపక్షం వరుస కధనాలకు స్పందన

**- స్త్రీ నిధి డబ్బులు రికవరీ చేస్తాం**
**- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారు**
**- స్త్రీ నిధి ఆర్ఎం రవీందర్‌నాయక్**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో, మున్సిపాలిటీలో దారితప్పిన స్త్రీ నిధి నిధులుపై వరుస కధనాలు ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురించడం జరిగింది. సోమవారం ప్రజాపక్షం కధనాలకు స్పందించిన ఖమ్మం జిల్లా స్త్రీ నిధి ఆర్ఎం రవీందర్ నాయక్ ప్రజాపక్షంతో మాట్లాడుతూ మండలంలో డ్వాక్రా గ్రూపుల నుండి వసూలు చేసిన డబ్బులు సొంత అవసరాలకు వాడుకున్న గ్రామదీపికల నుంచి కొంత వరకు రికవరీ చేయడం జరిగింది. ఇప్పటికే పలుచోట్ల జరిగిన ఆడిట్‌లో డబ్బులు దుర్వినియోగం గుర్తించడం జరిగింది. కొంతమంది నుంచి రికవరీ చేసాం, నిధులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్న వారిపై త్వరలోనే మండల అధికారులతో పొదుపు సంఘాలతో మాట్లాడి వారితో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. పాలడుగు విషయం కూడా తన దృష్టికి వచ్చిందని నిధులు రికవరీపై ప్రత్యేక దృష్టికి వచ్చిందని నిధులు రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. అదేవిధంగా స్త్రీ నిధి నుండి గేదెలు లోన్ తీసుకున్న వారి నుంచి కూడా రికవరీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలకు గ్రూప్ సభ్యులు మీ డబ్బులను మీ గ్రూపు సభ్యులే నేరుగా మీరే బ్యాంకులో వెళ్లి జమ చేసి రావాలి. ప్రతి నెల మీరు జమ చేస్తున్న డబ్బులు ఎంత ఉన్నాయి అనేది కూడా గుర్తుంచుకోవాలి అని ఆయన సూచించారు. డబ్బులను మీరే నేరుగా జమ చేస్తే ఎక్కడ ఎలాంటి ఇబ్బంది ఉండదు అని తెలిపారు.

స్త్రీనిధి నిధుల రికవరీ సంగతేంటి..!?



## బెల్ట్‌షాపులను తొలగించాలని వినతి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వి. వెంకటాయపాలెం గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలని కోరుతూ గ్రామానికి చెందిన టి. దానయ్య కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని ప్రధాన రహదారి బస్టాప్ వద్ద బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా సాయంత్రం సమయంలో మహిళలు, విద్యార్థినిలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని రోడ్లపైనే వాహనాలు అడ్డంగా పెడుతున్నారని దీనితో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తాగిన మైకంలో ఘర్షణకు పాల్పడుతూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి బెల్ట్‌షాపులను తొలగించాలని కోరారు.

## ఎంవీ,పాలెంలో మాస్‌లైన్ నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవీ,పాలెంలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దీనిని ఆ పార్టీ రాష్ట్ర, జాతీయ ప్రధాన కార్యదర్శి పోటు రంగారావుకు దేశద్రోహం కింద ఎన్ఐఏ నోటీసులు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. తొలుత బైక్‌ర్యాలీని సైతం నిర్వహించారు. అనంతరం మాస్‌లైన్ పాలేరుడివిజన్ నాయకుడు బండెల వెంకయ్య మాట్లాడుతూ...నోటీసులు ఇవ్వడమనేది, అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. బిజెపి పార్టీ పౌర, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు కుర్ర వెంకన్న, రెంటాల యాదగిరి, వీర్ల వెంకటఅప్పారావు, కందుల స్వామి, తోకల పెద్ద వెంకన్న, తోకల చిన్న వెంకన్న, శీలం శ్రీను, గుమ్మడి వీరబాబు, అవిలేని వెంకన్న, శీలం లెనిన్, దొండేటి సత్యనారాయణ, తోకల సంపత్, రెంటాల రామదాసు, కొట్టే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ సేవలను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండల ప్రజలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్ సూచించారు. సోమవారం చింతకాని మండలం పందిళ్ళపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బిఐ నూతన శాఖ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాజీవితంలో పొదుపు అనేది చాలా ముఖ్యమని ప్రతి ఒక్కరూ పొదుపు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎస్‌బిఐ ప్రజల కోసం ఎన్నో వినూత్న పథకాలను అందుబాటులో ఉంచిందన్నారు. ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, బ్యాంకు మేనేజర్ నిషార్ , చీఫ్ మేనేజర్లు ఫయాద్, రాంబ్రహ్మం, పందిళ్లపల్లి, గాంధీనగర్, బొప్పారం సర్పంచ్‌లు, బ్యాంకు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.